క్లుప్తంగా

గ్రాడ్యుయేట్స్ ఓటు నమోదు చేసుకోవాలి

మంగళగిరి: గుంటూరు, కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని నియోజకవర్గ ఈఆర్ఓ వెంకటలక్ష్మి మంగళవారం తెలిపారు. ఓటు నమోదుకు ఈ నెల 6 చివరి తేదీ అని డిగ్రీలో ఉత్తీర్ణత పొంది అర్హత ఉన్న వారు సీఈవో ఆంధ్ర వెబ్‌సైట్‌తో పాటు మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థ కార్యాలయంతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో ఫారం 18 దాఖలు చేసి నమోదు చేసుకోవచ్చన్నారు. ఫారం 18లో పాస్‌పోర్టు ఫొటో, గెజిటెడ్ ఆఫీసర్ ధ్రువీకరించిన డిగ్రీ సర్టిఫికేట్‌నకలు, ఎపిక్ కార్డు, ఆధార్ కార్డు, స్థానికతను తెలిపే కార్డు జతపరచాలని తెలిపారు. అర్హతలున్న గుంటూరు, కృష్ణా జిల్లా పట్టభద్ర ఓటర్లంతా తమ ఓటును నమోదు చేసుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు నూతక్కి విద్యార్థులు



నూతక్కి(మంగళగిరి): రాష్ట్ర స్థాయిలో జరిగే వాలీబాల్ పోటీలకు నూతక్కి జిల్లా పరిషత్ స్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాల పిడి కె.రజనీ నాయక్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 2వ తేదీన జరిగిన అండర్ -14 బాలుర, బాలికల గుంటూరు జిల్లా వాలీబాల్ జట్టుకు ముగ్గురు బాలికలు నూతక్కి నందు, నూతక్కి అనూహ్య, చాడవరపు నందుషాలు, ఇద్దరు బాలురు రావూరి కోటిసూర్య, బూరుగడ్డ జగన్‌లు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయినట్లు తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు విజయనగరం జిల్లా భోగాపురం గ్రామంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లిలోని లబ్ధిదారులకు మంగళవారం సీఎం సహాయనిధి చెక్కులను టీడీపీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు మాట్లాడారు. తాడేపల్లి పట్టణంలోని 16వ వార్డుకు చెందిన గోలి సతీష్ కుమారుడు సోహన్ శివేష్‌కు రూ.90,881 చెక్కును అందజేశారు. లబ్ధిదారులు మంత్రి నారా లోకేష్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల దొంగలు అరెస్టు

ఫిరంగిపురం: ఫిరంగిపురంలో ఇటీవల రాత్రి సమయాల్లో మోటారు సైకిళ్లు దొంగిలించిన దొంగలను మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ రవీంద్రబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఒక హోండాషైన్, రెండు స్కూటీలను దొంగిలించిన కేసులో గుంటూరుకు చెందిన ఉప్పుతల కనకారావు, వేమవరపు విద్యాసాగర్‌లను అరెస్టు చేశామన్నారు. స్థానికంగా వచ్చిన సమాచారంతో గ్రామ శివారులోని చెక్ పోస్టు వద్ద వారిని అరెస్టు చేసామన్నారు. వారి వద్దనున్న వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం నరసరావుపేట సెకండ్ ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

పత్తి లోడు ట్రాక్టర్ బోల్తా



ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు పత్తి లోడుతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పొనుగుపాడు గ్రామానికి చెందిన రైతులు పత్తిని ట్రాక్టర్‌పై లోడు చేసుకుని గుంటూరు వైపునకు తీసుకువెళుతుండగా ప్రమాదవశాత్తు ఫిరంగిపురంలోని కట్టెల అడితీల సమీపంలో ప్రధాన రహదారిపై బోల్తా పడింది. రోడ్డుపై ఓ వ్యక్తి అడ్డు రావడంతో తప్పించబోయి ప్రమాదం చోటు చేసుకుంది. ఎవరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదని చెబుతున్నారు.

కాల్ సెంటర్ పోస్టర్ల ఆవిష్కరణ



మంగళగిరి: నగర పాలక సంస్థ కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కారం కల్పించేందుకు వాల్ పోస్టర్లును రూపొందించినట్లు నగర కమిషనర్ ఆలీంబాషా తెలిపారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్రీనివాసరావు, అడిషనల్ కమిషనర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తి చేయండి..

ఆదాయం పొందండి

ప్రధానమంత్రి సూర్య ఘర్ రూఫ్ టాప్ యోజన ద్వారా 3 కిలోవాట్ల(కేవీ) విద్యుత్ ఉత్పత్తి చేసేలా ఇంటి పై కప్పుపై సోలార్ ప్యానల్స్‌ను కేంద్ర ప్రభుత్వ సబ్సిడీతో బిగిస్తారు. ఈ పథకానికి మొత్తం రూ.2 లక్షల 10 వేలు ఖర్చు కాగా అందులో కేంద్రం రూ.70 వేలు రాయితీ కల్పిస్తుంది. మిగిలిన మొత్తానికి బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు ఆదాయం కూడా పొందవచ్చు. సోలార్ విద్యుత్ వాడకం ద్వారా కరెంటు బిల్లును కూడా తగ్గించుకోవచ్చు. -తాడేపల్లి రూరల్

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన

- మంగళగిరి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు
- ఇంటింటికీ అవగాహన కార్యక్రమం
- సబ్సిడీపై సోలార్ ప్యానల్ బిగిస్తామంటూ ప్రచారం



సోలార్ ప్యానల్

ప్రధానమంత్రి సూర్య ఘర్ రూఫ్ టాప్ యోజన అమలు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు ఇంటింటికీ తిరిగి విస్తృత ప్రచారం చేస్తూ పథకం ప్రయోజనాలను వివరిస్తున్నారు. ఇప్పటికే 600 మంది వినియోగదారులకు సోలార్ ప్యానల్స్ బిగించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని వివరించారు.

■ రాష్ట్ర వ్యాప్తంగా 3 కేవీ భారతదేశంలో తయారు చేసిన సోలార్ ప్యానెల్‌ను బిగించడానికి రూ.2 లక్షల 10 వేలు ఖర్చు అవుతుంది. ఈ మొత్తంలో రూ.70 వేలు కేంద్ర ప్రభుత్వం రాయితీ కల్పిస్తుంది. ముందు కొంత నగదు చెల్లించాల్సి ఉంది. మిగిలిన డబ్బులు బ్యాంకు లోన్ ద్వారా అందజేసే విధంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు.

మంగళగిరి నియోజకవర్గంలో ఇలా...

మంగళగిరి నియోజకవర్గంలో మాత్రం 3 కేవీ సోలార్ ప్యానెల్ బిగించేందుకు రూ.1 లక్ష 80 వేలు మాత్రమే ఖర్చు అవుతుందని, అందులో రూ.70 వేలు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇవ్వగా మిగిలిన రూ.1 లక్ష 10 వేలు కూడా బ్యాంకర్లను ఒప్పించి లోన్ అందజేసే విధంగా చర్యలు చేపట్టినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలియజేశారు. సోలార్ విద్యుత్ కారణంగా విద్యుత్ బిల్లు తగ్గడమే కాకుండా ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి అయిన సమయంలో విద్యుత్ శాఖ ఆ విద్యుత్‌ను వినియోగించుకుని ఆరు నెలలకు ఒకసారి వినియోగదారుల ఖాతాలో నగదును జమచేస్తారని తెలిపారు.

■ మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 1 లక్ష 15 వేల గృహాలకు సంబంధించి మీటర్లు ఉన్నాయి. 2025 నాటికి కనీసం 30 శాతం మందికి సోలార్ ప్యానెల్ బిగించే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు.

■ నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 24 సబ్‌స్టేషన్లు ఉండగా వారంలో మూడు రోజులు సోలార్ ఉపయోగాలను ప్రజలకు వివరించే కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ చేపట్టింది. గతంలో ఈ పథకం ఉన్నప్పటికీ ప్రచారం లేకపోవడంతో ప్రజల ఆదరణ పొందలేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకంపై పూర్తిగా అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేయడంతో ఇంటింటికీ ప్రచారం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

■ వ్యవసాయానికి సంబంధించి కూడా సోలార్ ప్యానల్ ఏర్పాటు చేస్తామని, అందుకోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని, ఎవరి కన్నా 3 కేవీ కన్నా ఎక్కువ కావాలంటే సబ్సిడీ లేకుండా ప్యానల్ అందిస్తామని, అలాగే కమర్షియల్ వినియోగదారులకు కూడా సబ్సిడీ లేకుండా సోలార్ ప్యానల్ అందజేసే విధంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

రూ. 1 లక్ష 80 వేలకే పథకం



మంగళగిరి నియోజకవర్గంపై మంత్రి నారా లోకేష్ సోలార్ ప్యానల్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించారని, డీసీఆర్ (భారతదేశంలో తయారైన సోలార్ ప్యానల్) వారితో నేరుగా మంత్రి నారా లోకేష్ చర్చించి 3 కేవీకి సంబంధించి రూ.2 లక్షల 10 వేలు ఉన్న ఈ పథకాన్ని రూ.1 లక్ష 80 వేలకు కుదించారని, కొంత మంది బ్యాంకర్లతో చర్చించి ఆ మొత్తాన్ని లోన్ రూపంలో అందజేసే విధంగా చర్చలు నిర్వహించామని, జీరో బ్యాలెన్స్‌తో ఈ పథకాన్ని మంగళగిరి నియోజకవర్గ ప్రజలు పొందవచ్చని తెలిపారు.

-జి.సురేష్, ఏడీ, విద్యుత్ శాఖ, మంగళగిరి



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ ఏడీ సురేష్(ఫైల్)

ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి



మంగళగిరి: మండలంలో తొలిసారిగా ఆయిల్ పామ్ సాగు ప్రారంభమైంది. రామచంద్రాపురంలో ఆయిల్ పామ్ సాగును సంజీవరావు తోటలో ప్రారంభించారు. హ్యాహాన్ కాఫీ లిమిటెడ్ ముందుకు వచ్చి ఆయిల్ మొక్కలను అందించింది. రైతు సంజీవరావు తన మూడున్నర ఎకరాల అరటితోటలో అంతర పంటగా సాగు చేస్తున్నారు.175 మొక్కలనునాటారు. హ్యాహాన్ కాఫీ కంపెనీ డీజీఎం రైతు సంజీవరావు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కంపెనీతో పాటు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని ఉద్యానవన శాఖ హెచ్‌వో కె.దీపిక తెలిపారు.

ఇంటి నుంచి అలిగి వెళ్లిన విద్యార్థి



తాడికొండ: పాఠశాలకు వెళ్లలేదని తల్లిదండ్రులు మందలించడంతో విద్యార్థి ఇంటి నుంచి అలిగి వెళ్లిన ఘటన తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవరపల్లి వెంకట నరసయ్య కుమారుడు పొన్నెకల్లు గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 2వ తేదీన పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండి టీవీ చూస్తున్నాడని తల్లి మందలించింది. దీంతో ఇంటి నుంచి చెప్పకుండా మహేష్ బాబు వెళ్లిపోయాడు. బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో విచారించగా ఆచూకి తెలియకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

కార్మికుల సమస్య పరిష్కారం కోసం జిల్లా వ్యాప్త ఉద్యమం




ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు, వివిధ యూనియన్ల నాయకులు

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య పరిష్కారం కోసం జిల్లా వ్యాప్త ఉద్యమం చేపడతామని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. మంగళవారం ప్రజా సంఘాలు, అఖిల పక్ష ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో తాడేపల్లి ఎమ్మార్వో కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. తాడేపల్లి తహసీల్దార్‌కు సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యం అక్రమ లాకౌట్ ప్రకటించడంతో కార్మికులు రోడ్డున పడ్డారని అన్నారు. వేలంలో ఫ్యాక్టరీ భూములను రాజకీయ పార్టీల నాయకుల ముసుగులో కొందరు ఎన్ఆర్ఐలు కొనుగోలు చేశారని అన్నారు. కార్మికులకు నష్టపరిహారం ఇవ్వాలని స్పష్టంగా తీర్పు చెప్పినా అమలు చేయడం లేదని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్‌కు ఎన్నికలకు ముందు, తరువాత కూడా కార్మికులు యూనియన్ల తరపున అర్జీలు ఇచ్చారని అన్నారు. సీపీఐఎంఎల్ న్యూ నాయకులు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు మాట్లాడుతూ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. 167 మంది మృతికి కారణమైన యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎంపీలు ఎమ్మెల్యేలు మారినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మార్వో సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ నాయకులు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుల ఎం.రవి, సీటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరులో ఉల్లాస్ కార్యక్రమం

మేడికొండూరు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జాతీయ విద్యా విధానం 2020 సిఫార్సులకు అనుగుణంగా ఉల్లాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో తోట చందన అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా 15 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ వయసు గల నిరక్షరాస్యులందరికీ అక్షర జ్ఞానం పెంపొందించే దిశగా అడుగులు వేయడం జరుగుతుందని తెలిపారు. వయోజన విద్య సూపర్‌వైజర్ చలపతిరావు మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్, చట్టపరమైన, ఆరోగ్య సంరక్షణపై అవగాహన, పిల్లల సంరక్షణ విద్య, కుటుంబ సంక్షేమం మొదలైనవి ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. ఏపీఎం విజయభారతి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ 10 మంది నిరక్షరాస్య మహిళలకు సాయంత్రం 5 గంటల నుంచి 8 వరకు 6 నెలల పాటు ఈ అంశాలపై శిక్షణ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అలీం, ఐసీడీఎస్ సూపర్ వైజర్ హేమలత, కృష్ణకుమారి, సీసీ షేక్ కరిముల్లా మేరీ, వీఓఏలు దుర్గా, ఫిరాఖ్, ఉదయలక్ష్మి, ఉడతా భాగ్యలక్ష్మి, నోసిన ప్రసన్న, ఎడ్ల శిరీష, డి.జ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో చందన

త్వరలో అన్ని గ్రామాల్లో నైపుణ్య గణన సర్వే

తాడికొండ: త్వరలో అన్ని గ్రామాల్లో నైపుణ్య గణన సర్వే చేపట్టడం జరుగుతుందని కనుక సిబ్బంది యాప్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తాడికొండ ఎంపీడీవో కె.సమతావాణి సూచించారు. మంగళవారం సచివాలయ సిబ్బందికి తాడికొండ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నైపుణ్య గణనలో 15-59 సంవత్సరాల లోపు ఉన్న వ్యక్తుల వివరాలను సర్వే చేసి యాప్‌లో పొందుపరచాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వస్తారని, వారికి అవసరమైన సమాచారం ఇచ్చి ప్రజలు సహకరించేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మండలంలోని 15 గ్రామాలకు చెందిన సచివాలయ సిబ్బందికి రెండు సెషన్స్‌గా శిక్షణ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శివలీల పలువురు సిబ్బంది, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో కె.సమతావాణి

చైతన్య గోదావరి బ్యాంక్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని వినాయకుని గుడి వద్ద ఉన్న చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించి మహిళలకు, విద్యార్థులకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్ వంటి ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ జె.వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బ్యాంక్ ఖాతా పొందడం వల్ల కలిగే లాభాలను, ఇతర లావాదేవీలను ప్రజలకు వివరించేందుకు ఈ విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించామని ఇందులో భాగంగా మహిళలకు, విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామని, ప్రజలకు అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్ళం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు, మహిళలు, విద్యార్థులు, విజిలెన్స్ అధికారి విజయకుమార్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ విజిలెన్స్ ఇన్‌చార్జి రాంబాబు, బ్యాంక్ గుంటూరు రీజనల్ మేనేజర్ హెచ్ శ్రీనివాస్, మెప్మా కో ఆర్డినేటర్ పద్మ పాల్గొన్నారు.



వైభవంగా నాగుల చవితి



పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



వేణుగోపాలస్వామి ఆలయంలోని పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



క్యూలైన్‌లో భక్తులు



కొండపావులూరి గార్డెన్స్‌లో...



సీతానగరం సోమేశ్వరస్వామి ఆలయంలో...

ఫిరంగిపురం: నాగుల చవితి పురస్కరించుకొని పలు గ్రామాల్లో భక్తులు మంగళవారం పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల వద్ద ఉన్న పుట్టలలో పాలు పోసి, దీపాలు వెలిగించి ప్రసాదాలను సమర్పించారు. స్థానిక ఫిరంగిపురంలోని వేణుగోపాలస్వామి ఆలయంలోని పుట్ట వద్ద భక్తులు తెల్లవారుజాము నుంచి పూజలు చేశారు.

నాగేంద్రస్వామి పుట్టలకు పోటెత్తిన భక్తులు

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు నాగంద్రస్వామి పుట్టతోటలో నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. స్వామి వారి పుట్టను పుష్పాలు, నాగాభరణాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. పుట్టలో పాలుపోసి నైవేద్యాలను సమర్పించారు. మంగళగిరి పరిసర ప్రాంతాలతో పాటు విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కాసు రామకృష్ణారెడ్డి, రత్నకుమారి దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించగా మంగళగిరి రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాగేంద్రుని అనుగ్రహం కోసం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోను, దుగ్గిరాల మండల పరిధిలోని మంగళవారం నాగుల చవితి పండుగను భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని విజయవాడ క్లబ్ సమీపంలో కొండపావులూరు గార్డెన్స్‌లో సహజంగా ఏర్పడిన నాగేంద్రుని పుట్టలో పాలు పోసి నాగేంద్రుని అనుగ్రహం పొందేందుకు భక్తులు బారులు తీరారు. సీతానగరం సోమేశ్వరస్వామి ఆలయంలో పుట్ట వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గార్డెన్ నిర్వాహకులు వెంకటేశ్వరరావు మాట్లాడారు. తాడేపల్లి వీరభద్రస్వామి దేవస్థానం, సోమేశ్వరస్వామి దేవస్థానం, ఎన్‌టీఆర్ కరకట్ట వెంబడి ఉన్న నాగేంద్రస్వామి దేవస్థానం, పోలకంపాడు వినుకొండ అంకమ్మ దేవస్థానం, తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోను, దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానంలోను నాగుల చవితి పూజలు నిర్వహించారు. కరకట్టపై నాగేంద్రస్వామి ఆలయం నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం బ్యాంకు ఖాతాల లావాదేవీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారతీయ రిజర్వు బ్యాంకు, ల్యాంపు సంస్థ ఆధ్వర్యంలో (డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్) ఖాతాదారుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక చైతన్య గోదావరి బ్యాంకు మేనేజర్ శాంతకుమారి పాల్గొని మాట్లాడుతూ నేటి సమాజంలో బ్యాంకు రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని ఖాతాదారులు వినియోగించుకోవాలని చెప్పారు. ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా, బీమా యోజన వంటి ఖాతాలపై అవగాహన ఉండాలన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కె.సాల్మన్‌పాల్ మాట్లాడుతూ డిజిటల్ బ్యాంకు వ్యవస్థపై ఖాతాదారులకు అవగాహన ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ల్యాంప్ రిసోర్స్ పర్సన్ కె.వెంకటేశ్వరరావు, డ్వాక్రా సీసీ నాగరాజు , విజయభాస్కర్, యానిమేటర్స్, ఖాతాదారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

నేటితో పట్టభద్రుల ఓటు నమోదుకు ముగింపు

ఫిరంగిపురం: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు నమోదు ప్రక్రియ బుధవారంతో ముగుస్తుందని తహసీల్దార్ ప్రసాదరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటు హక్కు నమోదుకు ఇప్పటివరకు 1,337 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. దీంతో తొలిదశ ఓటు నమోదు ముగుస్తుందని తెలిపారు. విచారణ పూర్తి చేసిన అనంతరం 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తామని, రెండో దశలో వచ్చిన దరఖాస్తులను డిసెంబర్ 25 నాటికి విచారించి 30న తుది ఓటర్ల జాబితా తెలియజేస్తామన్నారు.

తాడేపల్లిరూరల్ : గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు బుధవారం ఆఖరు అని, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలోని ఓటర్లు నవంబర్ 1, 2021లోపు డిగ్రీలో ఉత్తీర్ణత పొంది, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో నివాసముండే వారు ఫారం 18 దాఖలు చేసి ఓటు నమోదు చేసుకోవాలని కోరారు.

మహిళల భద్రత యాప్‌పై అవగాహన

మంగళగిరి: ప్రమాదం సంభవించినపుడు అత్యవసర పరిస్థితులలో మహిళలు, బాలికలు భద్రత కోసం ఉమెన్ సేఫ్టీ యాప్‌ను తప్పనిసరిగా వినియోగించుకోవాలని కేఎల్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డి.ఉషారాణి కోరారు. ఉమెన్ సేఫ్టీ యాప్‌పై మండలంలోని పెదవడ్లపూడిలో మంగళవారం కేఎల్‌యూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మహిళలకు అవగాహన కల్పించారు. ఆపదలో ఇంటర్‌నెట్ లేకపోయినా యాప్ ఉపయోగించి ఆప్షన్ క్లిక్ చేస్తే పోలీసులకు మెసేజ్ చేరి ఘటనా స్థలానికి చేరుకుని రక్షిస్తారని తెలిపారు. డీన్ కేఆర్ఎస్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి, ఫీల్డ్ కోఆర్డినేటర్ సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

8న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తాడికొండ: ఈ నెల 8వ తేదీన తాడికొండ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.సమతావాణి తెలిపారు. ఎంపీడీవో తాళ్ళ భాగ్యలక్ష్మీ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు మండల స్థాయి అధికారులు తమ శాఖల పరిధిలోని ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆమె సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఫిరంగిపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యురాలు శ్వేతకు 104 ఉద్యోగులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. 104 వాహనంలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత లేదని, వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్ట్‌లో పెట్టాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో 104 జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, సింగరాజులు ఉన్నారు.